

రవాణా 'గ'లీజు'

- ట్రాన్స్‌పోర్ట్ చార్జీల పేరిట గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యం
- హమాలీ, రవాణా చార్జీల చెల్లింపులు నిలిపివేసిన కాంట్రాక్టర్లు
- సొమ్ముల కోసం సబ్‌లీజుదారుల చుట్టూ కార్మికుల ప్రదక్షిణలు
- దాంతో ప్రభుత్వ మద్యం దుకాణాలకు ఆగిన సరఫరా

(అమలాపురం టౌన్)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. గత వైసీపీ పాలనలో ప్రధాన శాఖల్లో జరిగిన అవినీతిని వెలికితీసే పని ప్రారంభించారు. ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న మద్యం అమ్మకాలతోపాటు దానికి అనుసంధానంగా జరిగిన అక్రమాలను గుర్తించే పనిని కూటమి ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రైవేటు మద్యం దుకాణాలను తొలగించి వాటి స్థానే ప్రభుత్వ మద్యం దుకాణాలను ఏర్పాటు చేసింది. ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా నాసిరకం కంపెనీల మద్యంతో ప్రభుత్వం మద్యం దుకాణాలను నడిపేసింది. అంతేకాకుండా మద్యం ధరలను విపరీతంగా పెంచేసి నిరుపేదలను నిలువునా దోచేసింది. కోనసీమలో అంతర్భాగంగా కనిపించే పుదుచ్చేరి యానాంలో అన్ని రకాల మద్యం లభ్యమవుతోంది. అంతేకాకుండా అక్కడ మద్యం ధరలు కూడా బహు తక్కువ. యానాంలో చీప్ లిక్కర్ నిబ్బు ధర రూ.70 ఉంటే మనకు మాత్రం ఏవేవో ఎక్కడాలేని కొత్త రకంగా బ్రాండ్లు పెట్టి రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. సుమారు మూడు రెట్ల ప్రజల సొమ్మును ఏరోజుకారోజు దోచేశారు. దశలవారీగా మద్యపాన నిషేధం అమలుచేస్తామని అప్పట్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మద్యాన్ని ఏరులై పారించడంతోపాటు ఎక్కడికక్కడ మద్యం బెల్టుషాపులతో పేదల సొమ్ములను సొంత ఖజానాలకు మళ్లించేసుకుంది. ఆ పాపానికి ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి జనం తగిన గుణపాఠమే చెప్పారు. అయితే వైసీపీ ఏలుబడిలో జరిగిన అవినీతి, అక్రమాల్లో ట్రాన్స్‌పోర్టు, హమాలీల చార్జీల చెల్లింపులో కూడా భారీ కుంభకోణమే చోటుచేసుకుందని గుర్తించారు. రవాణా, హమాలీ చార్జీల చెల్లింపుల్లో జరిగిన కుంభకోణంపై ఇప్పటికే కూటమి ప్రభుత్వం అంతర్గత విచారణ చేపట్టింది.

బినామీలతోనే మద్యం సరఫరా..

లిక్కర్ గొడౌన్ల నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలకు సరుకు సరఫరా చేసే కాంట్రాక్టుల్లోనూ వైసీపీ ప్రభుత్వం తన చేతివాటం చూపించింది. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఆ పార్టీ కీలక నాయకుల కనుసన్నల్లోనే మద్యం సరఫరా చేశారు. గత 45 రోజులుగా షాపులకు మద్యం సరఫరా చేసిన వారికి రవాణా, హమాలీ చార్జీలను చెల్లించడం నిలిపివేశారు. దాంతో ఇప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయిన కార్మికులు లబోదిబోమంటున్నారు. గతంలో మద్యం సరఫరాను సిగ్మా ట్రాన్స్‌పోర్టు చేపట్టింది. ప్రస్తుతం ఆ బాధ్యతలను గత ఏడాది నుంచి ప్రసాద్ ట్రాన్స్‌పోర్టు నిర్వహిస్తోంది. ఈ ట్రాన్స్‌పోర్టు సంస్థ జిల్లాకొకరిని సబ్‌లీజుకు నియమించుకుంది. అక్కడితో ఆగకుండా ఆయా జిల్లాల వైసీపీ ముఖ్య నాయకుల అనుచరులు మళ్లీ సబ్‌లీజు తీసుకుని మద్యం రవాణా చేస్తున్నారు. ఒక్కసారిగా ప్రసాద్ ట్రాన్స్‌పోర్టు కేంద్ర కార్యాలయం నుంచి జిల్లాలకు రావాల్సిన బకాయిలు నిలిచిపోవడంతో స్థానికంగా సబ్ ఏజెంట్లు, సబ్ లీజులు పొందినవారు చేతులెత్తేశారు. దాంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సామర్లకోట, రాజమహేంద్రవరం, అమలాపురం ప్రధాన డిపోల నుంచి ఈ నెల 27వ తేదీ నుంచి మద్యం సరఫరా నిలిచిపోయింది. లీజులు, సబ్‌లీజులు పొందినవారు కనీసం డిపోలకు సమాచారం కూడా ఇవ్వకుండా రెండు రోజులుగా సరుకు రవాణాను పూర్తిగా నిలుపుదల చేయడం వెనుక భారీ కుంభకోణమే దాగుందన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతోంది.

మద్యం కేసుల సరఫరాలోనూ దోపిడీయే..

ప్రభుత్వ మద్యం షాపులకు రవాణా చేసే మద్యం కేసుల సరఫరాలోనూ భారీ దోపిడీ జరిగింది. అమలాపురం లిక్కర్ డిపో పరిధిలో పది



ఈదరపల్లి బైపాస్ రోడ్డులోని ప్రభుత్వ మద్యం గొడౌన్

వాహనాల ద్వారా నిత్యం జిల్లావ్యాప్తంగా ఉన్న వంద మద్యం షాపులకు మద్యం కేసులు సరఫరా చేస్తున్నారు. వాహన యజమానికి కేసు ఒక్కింటికి రూ.8.15 మాత్రమే చెల్లిస్తున్నారు. కేసులు మోసే హమాలీలకు ఒక్కింటికీ రూ.7.30 చెల్లిస్తున్నారు. అమలాపురం లిక్కర్ డిపోలో రోజుకు సుమారు 4 వేల మద్యం కేసులు సరఫరా చేస్తుంటారు. అంటే హమాలీలకు రోజుకు రూ.30 వేల నుంచిరూ.40 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. అదే సామర్లకోట ప్రధాన లిక్కర్ డిపో పరిధిలో 150 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉంటే రాజమహేంద్రవరం లిక్కర్ డిపో పరిధిలో వంద మద్యం షాపులు ఉన్నాయి. ఆయా డిపోల్లో హమాలీలకు రోజుకు రూ.40 వేల నుంచి రూ.70 వేల వరకు రోజువారీ చెల్లింపులు జరపాల్సి ఉంటుంది. ప్రసాద్ ట్రాన్స్‌పోర్టు సంస్థ అమలాపురం లిక్కర్ డిపో పరిధిలో బి.సతీష్ అనే వ్యక్తికి సరుకు సరఫరా సబ్ లీజుకు ఇచ్చింది. ఇక్కడ వైసీపీ అనుచరుడొకరు మళ్లీ సబ్ లీజుకు తీసుకుని ట్రాన్స్‌పోర్టర్లను, హమాలీలకు 45 రోజులుగా సొమ్ములు చెల్లించకుండా నిలువునా ముంచేశారు. దూరాభారాన్ని బట్టి లిక్కర్ కేసులకు సొమ్ములు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో కేసుకు దూరాన్ని బట్టిరూ.11 నుంచి రూ.16 వరకు ట్రాన్స్‌పోర్టు చార్జీ స్థానికంగా చెల్లించాల్సి ఉంది. అయితే కేవలం రూ.8.15 మాత్రమే చెల్లిస్తూ దోపిడీని జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి తీసుకుపోయారు. జిల్లాలోని ఒక్కో ట్రాన్స్‌పోర్టర్‌కు 45 రోజులకు సంబంధించిన రవాణా చార్జీలే కాకుండా పాత బకాయిలతో కలిపి ఒక్కొక్కరికీ రూ.1.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు చెల్లించాలి. వీరితోపాటు హమాలీల చార్జీల చెల్లింపులు కూడా నిలిచిపోయాయి. వీరికి రెండు రోజులుగా ఒకపక్క పనులు లేక.. మరోపక్క చేసిన పనులకు సొమ్ములు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలు బకాయిలు ఎప్పుడు విడుదలవుతాయో, మళ్లీ పనులు ఎప్పుడు చేసుకోవాలో తెలియట్లేదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

మద్యం ధరలకు రెక్కలు వచ్చేనా..

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అప్పట్లో వైసీపీకి చెందిన వారిని అధిక శాతం నియమించారు. ఇప్పటికే బెల్టు షాపులకు మద్యం తరలింపుతోపాటు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు సైతం ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయం దాటిపోయిన తర్వాత ఆయా మద్యం షాపుల పక్కనే ఒక్కో నిబ్‌కు రూ.20 నుంచి రూ.50 వరకు పెంచి విక్రయిస్తూ సొమ్ములు చేసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో మద్యం సరఫరా నిలిచిపోవడంతో గతంలో మాదిరిగానే సరుకును పక్కదారి పట్టిస్తారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరో మూడు రోజుల్లో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సరుకు నిండుకునే అవకాశం ఉంది. అయితే బార్‌లకు ప్రత్యేక రవాణా వ్యవస్థ ఉండడంతో అక్కడ సరుకు పుష్కలంగా ఉన్నప్పటికీ మద్యం ధరల్లో భారీ వ్యత్యాసం ఉంది. దానికి తోడు మద్యం బ్లాక్ మార్కెట్‌కు చేరితే ధరలు మరింత ప్రియం అయ్యే అవకాశం పొంచి ఉంది.



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా

కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : హిమాన్షుశుక్లా

అమలాపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదేశించారు. ప్రధానంగా డెంగ్యూ, మలేరియా, డయేరియా వంటి వ్యాధుల నియంత్రణకు లైన్ డిపార్టుమెంట్ అధికారులు పక్కా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం లైన్ డిపార్టుమెంట్ అధికారులతో కలెక్టర్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జూలై 1 నుంచి 31 వరకు జరిగే డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం, విధి విధానాలపై చర్చించారు. రుతుపవనాల ఆగమనంతో ఈ వ్యాధి ప్రబలే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. డెంగ్యూ నివారణే ప్రజానీకానికి ఉత్తమ రక్షణ అన్నారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణ చర్యలపై అధికారులతో ఆయన సమీక్షించి దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యంతోపాటు దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ శుక్రవారం సచివాలయ సిబ్బంది సహకారంతో డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పురపాలక సంఘాల్లో యాంటీ లార్వా ఆపరేషన్లు, ఫాగింగ్ ఆపరేషన్లు విస్తృతంగా చేపట్టి మురుగు డ్రైన్లలో కీటకాల వ్యాప్తికి ఆస్కారం లేకుండా మందులు పిచికారీ చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, వసతిగృహాల ప్రాంగణాల్లో దోమలవ్యాప్తికి కారణమవుతున్న గడ్డి, మురుగు గుంటలను ఎంపీడీవో సహకారంతో ఉపాధి హామీ ద్వారా చర్యలు తీసుకోవాలన్నారు. సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల వసతిగృహాల్లో ఆర్వో వాటర్ ప్లాంట్‌లను వినియోగిస్తూ సురక్షిత తాగునీటిని అందించాలన్నారు. వసతిగృహాల్లో కిటికీలకు దోమల మెస్‌లను ఏర్పాటుచేయాలన్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో దోమలవ్యాప్తితోపాటు గోదావరికి వరదలు వచ్చే అవకాశాలు ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, అదనపు డీఎంహెచ్‌వో సీహెచ్‌వీ భరతలక్ష్మి, సీపీవో వెంకటేశ్వర్లు, డీపీవో డి.రాంబాబు, మున్సిపల్ కమిషనర్లు, ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణి, డీఈవో ఎం.కమలకుమారి, ప్రోగ్రాం ఆఫీసర్ సుమలత, డీసీహెచ్‌ఎస్ కార్తీక్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ సురేష్‌బాబు, సాంఘికసంక్షేమశాఖ ఉపసంచాలకురాలు పి.జ్యోతిలక్ష్మీదేవి పాల్గొన్నారు.

అధికారుల ఏలుబడిలోకి వ్యవసాయ పరపతి సంఘాలు

జిల్లాలో 166 పీఏసీఎస్‌లకు అధికారుల నియామకానికి చర్యలు

అమలాపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు అధికారుల ఏలుబడిలోకి తీసుకువస్తూ సహకారశాఖ కమిషనర్ అండ్ రిజిస్ట్రార్ ఎ.బాబు 27న ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలోని 166 వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు అధికారులను పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేపట్టింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించకుండా ఐదేళ్లు గడిపేసింది. పీఏసీఎస్‌లను తమ గుప్పెట్లో ఉంచుకునేందుకు వైసీపీ నేతలు, కార్యకర్తలతో త్రీమెన్ కమిటీలను నియమించింది. వారి ఏలుబడిలోనే సహకార సంఘాలు కొనసాగాయి. రాష్ట్రంలో నూతనంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో త్రీమెన్ కమిటీలు రాజీనామాలను ఆయా సంఘాల కార్యదర్శులకు అందజేశారు. జిల్లాలో 166 పీఏసీఎస్‌లు ఉండగా మామిడికుదురు మండలం ఈదరాడ, నగరం పీఏసీఎస్‌లు ఇప్పటికే అధికారుల ఏలుబడిలో ఉన్నాయి. మిగిలిన 164 సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జిలను నియమించనున్నట్టు జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణ తెలిపారు. ఆరు నెలల కాల వ్యవధితో పర్సన్ ఇన్‌చార్జిలను నియమించడం జరుగుతుందని, ఈ ఏడాది డిసెంబరు 20 వరకు పర్సన్ ఇన్‌చార్జిలుగా వీరు కొనసాగుతారని, ఎన్నికలు నిర్వహిస్తే ఆ కమిటీలను రద్దు చేస్తామని వివరించారు.



గెజిట్ ప్రతులను అందజేస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 28: రామచంద్రపురంలో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం గెజిట్‌నోటిఫికేషన్ జారీచేసింది. ఈనెల 27న జీవో ఎంఎస్ 71 ప్రకారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ జారీచేయడం పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీ తదితరులు జీవో ప్రతులను సీనియర్ సివిల్ జడ్జికి కె.వెంకటేశ్వరరావుకు అందజేశారు. బార్ అసోసియేషన్ భవనంలో న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి, కక్షిదారులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ, జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్లా పృథ్వీరామయ్య సీనియర్ న్యాయవాదులు ఆర్‌వీజీ సుబ్బారావు, కొండేపూడి భరత్ కుమార్, సూరంపూడి సత్యనారాయణ, ఇనకోటి చంద్రరావు, నరేంద్రకుమార్, జగదీష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

గజానికో గుంత!





ముమ్మిడివరం మండలం అయినాపురం దూడల చెరువు సమీపంలో అధ్వానంగా మారిన ఆర్‌అండ్‌బీ రోడ్డు.. (పక్కన) అయినాపురం చిట్టిచెరువు సమీపంలో...

- అధ్వానంగా మారిన ముమ్మిడివరం-కాట్రేనికోన ఆర్‌అండ్‌బీ రోడ్డు
- అడుగడుగునా గోతులమయం
- ప్రమాదాల బారిన వాహనచోదకులు
- తక్షణం మరమ్మతులు చేయాలని ప్రజలు వేడుకోలు





సోమిదేవరపాలెం యరకాయి చెర్వు వద్ద.. ముమ్మిడివరం బాలయోగీశ్వరుల ఆశ్రమం సమీపాన

ముమ్మిడివరం, జూన్28: చినుకుపడితేచాలు రహదారులు ఛిద్రమవుతున్నాయి. గజానికొక గుంతతో అధ్వానంగా మారి ప్రమాదాలకు నెలవవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్ల ఆధునికీకరణను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో ఈ దుస్థితి నెలకొంది. రెండు మండల కేంద్రాలను కలిపే ముమ్మిడివరం- కాట్రేనికోన ఆర్‌అండ్‌బీ రోడ్డు దారుణంగా మారింది. 9.330 మీటర్ల నిడివి గల ఈ రోడ్డును రూ.23.52 కోట్లతో ఆధునికీకరించేందుకు 2022 మే 13న నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఒకవైపు పంటకాల్వ, మరోవైపు ఊడ్పుభూములు ఉండడంతో రోడ్డు దిగబడి పెద్దపెద్ద గుంతలమయంగా మారింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణం చేసేవారు తరచూ ప్రమాదాల బారినపడుతున్నారు. రోడ్డు ఆధునికీకరణ ఆవశ్యకతపై నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో 9వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అడబాల సతీష్‌కుమార్ పలుమార్లు చర్చకు తీసుకువచ్చారు. రూ.20 వేల సొంత ఖర్చుతో ఎక్స్‌కవేటరుతో గుంతలు పూడ్పించారు. ఆ తర్వాత అయినాపురం గ్రామస్తులు గ్రామసభలో రోడ్డు దుస్థితిపై వైసీపీ నేతలను నిలదీయడంతో ఎంపీపీ భర్త కోలా బాబ్జీ కూడా ఈ రోడ్డును కొంతమేర ఎక్స్‌కవేటరుతో సరిచేయించారు. అయితే పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. వేసవిలో మట్టి ట్రాక్టర్లు తిరగడం, వాహనాల రాకపోకలు ఎక్కువవ్వడంతో రోడ్డు గోతులుపడి అధ్వానంగా మారింది. ముమ్మిడివరం నుంచి కాట్రేనికోన ఈ దారిలో తొమ్మిది కిలోమీటర్ల దూరం ఉంటుంది. మహిపాలచెరువు, చెయ్యేరు మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాలంటే 15 కిలోమీటర్లు. రోడ్డు అధ్వానంగా మారడంతో ముమ్మిడివరం నుంచి కాట్రేనికోనకు మహిపాలచెరువు మీదుగా వెళ్లాల్సివస్తోంది. తిరుగు ప్రయాణంలోనూ అంతే. స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు, ఆస్పత్రికి వెళ్లే మహిళలు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేవారు నిత్యం ఈ దారిలో రాకపోకలు సాగిస్తుంటారు. ముమ్మిడివరం-ముక్తేశ్వరం ఆర్‌అండ్‌బీ రోడ్డు పలుచోట్ల అధ్వానంగా మారింది. దీంతో అటు వెళ్లేవారు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం రోడ్డు ఆధునికీకరణపై దృష్టిసారించాలని జనం కోరుతున్నారు.

కనీస మరమ్మతులైనా చేపట్టాలి



రోడ్డు అధ్వానంగా మారింది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆధునికీకరించాలంటూ ప్రజాప్రతినిధులు, అధికారులను అడిగి అడిగి విసుగుచెందాం. రూ.20 వేలతో రోడ్డులోని పెద్ద గుంతలను పూడ్చి పెట్టించా. వర్షాకాలం రావడంతో రోడ్డులో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనచోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. కనీస మరమ్మతులైనా చేస్తే రాకపోకలకు వీలుగా ఉంటుంది. బాలింతలు, గర్భిణులు, వృద్ధులు, విద్యార్థులు ఆ రోడ్డులో వెళ్లాలంటే భయపడుతున్నారు. కాట్రేనికోన మండలం చుట్టు తిరిగి వెళ్లాల్సి వస్తోంది. అక్కడి ప్రజలూ చుట్టుతిరిగి ప్రయాణం సాగిస్తున్నారు.

- అడబాల సతీష్‌కుమార్, 9వ వార్డు కౌన్సిలర్

రోడ్డు ఆధునికీకరణకు చర్యలు చేపట్టాలి



ఈ రోడ్డులో భారీ వాహనాలు, మట్టిలోడు ట్రాక్టర్లు తిరగడంతో పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. నిత్యం అనేక మంది ప్రయాణాలు సాగిస్తుంటారు. స్కూలు విద్యార్థులకు, ఆసుపత్రులకు వెళ్లేవారికి ఇదే ప్రధాన మార్గం. గుంతలుపడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షం పడినప్పుడు ప్రయాణం నరకయాతనగా ఉంటోంది. ఒకపక్క కాల్వ, మరోపక్క వరిపొలాలు ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు ఆధునికీకరణకు తక్షణం చర్యలు చేపట్టాలి.

- సలాది బుచ్చినారాయణ, మాజీ సర్పంచ్, సోమిదేవరపాలెం





ఆలమూరు మండలం కొత్తూరు-వెదురుమూడి రోడ్డు దుస్థితి.. పినపళ్ల వద్ద బోల్తా పడిన లారీ (ఫైల్‌ఫొటో)

ప్రమాదాల రాదారి

పట్టించుకునే వారేరీ!

ఆలమూరు, జూన్ 28: ఆలమూరు మండలంలోని కొత్తూరు-వెదురుమూడి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణం అంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కడియం నుంచి వెదురుమూడి వరకు ఉన్న ఈ ఆర్‌అండ్‌బీ రోడ్డును దాదాపు రెండు దశాబ్దాల కిందటే వెడల్పు చేసి అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. దీంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో రోడ్లు, భవనాలశాఖ మంత్రిగా ఉన్న జక్కంపూడి రామ్మోహనరావు నిధులు మంజూరు చేయించారు. అయితే ఈ నిధులతో కడియం నుంచి కొత్తూరు సెంటరు వరకు రోడ్డును వెడల్పు చేశారు. నిధుల కొరతతో కొత్తూరు నుంచి వెదురుమూడి వరకు దాదాపు ఐదు కిలోమీటర్లు వదిలేశారు. అప్పటి నుంచీ పట్టించుకునే వారే కరువయ్యారు. కొత్తూరు నుంచి వెదురుమూడి గ్రామం వరకు దాదాపు ఆరేడు గ్రామాల ప్రజలతోపాటు వందలాది వాహనాలు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తాయి. ఈ రోడ్డుకు ఒకపక్క పంట భూములు, మరోపక్క పంట కాలువ ఉన్నాయి. భారీ గోతులు ఏర్పడి తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ దారిలో గత మూడు, నాలుగేళ్లుగా అనేక ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాతపడ్డారు. అనేక మందికి క్షతగాత్రులయ్యారు. ఈ మార్గం ఇంత దయనీయంగా ఉన్నప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం పట్టించుకోవట్లేదని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు గుర్తించి తక్షణం నిధులు మంజూరు చేసి రోడ్డు వెడల్పు చేసి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.



ఎస్సీ వసతి గృహంలో అన్నం పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

ఈ నీళ్లు తాగుతారా..

- హెచ్‌ఎంను ప్రశ్నించిన మంత్రి సుభాష్
- పాఠశాలలు, ఎస్సీ వసతి గృహాలను తనిఖీ చేసిన మంత్రి
- వెంకటాయపాలెంలో సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు ఎందుకు పెట్టలేదంటూ నిలదీత

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 28 : డ్రైనేజీ పక్కనే చేతిపంపు.. ఈ నీరు మీరు తాగుతారా ధర్మంగా చెప్పండి, మరి పిల్లలచేత ఎలా తాగిస్తున్నారు అంటూ తాళ్లపొలం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మణరావును మంత్రి సుభాష్ ప్రశ్నించారు. శుక్రవారం రామచంద్రపురం మండలం తాళ్లపొలం ప్రాథమికోన్నత పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్‌ఎం పిల్లలు ఇంటివద్ద నుంచి నీరు తెచ్చుకుంటున్నారని చెప్పగా మీరు ఇంటివద్ద నుంచి తెచ్చుకున్న నీరు ఎప్పటివరకు వస్తున్నాయని విద్యార్థులను మంత్రి ప్రశ్నించారు. కొద్దిసేపటికే అయిపోతున్నాయని తరువాత చేతిపంపు నీళ్ల తాగుతున్నామని విద్యార్థులు మంత్రికి తెలిపారు. రేపటి నుంచి రక్షిత మంచినీరు టిన్నులు తెప్పించండి డబ్బులు ఇస్తాను అని మంత్రి హెచ్‌ఎంను ఆదేశించారు. అదేవిధంగా పట్టణంలో మున్సిపల్ బాలికోన్నత పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థినులతో మధ్యాహ్న భోజనం గురించి ప్రశ్నించారు. మంత్రి స్వయంగా భోజనం రుచి చూశారు. ఫోన్లు పాఠశాల సమయంలో వాడకం తగ్గించాలని ఆయన సూచించారు. ఆర్‌వో ప్లాంటు పరిశీలించారు. అనంతరం కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. డైనింగ్ హాలు, బాత్‌రూమ్‌లు పరిశీలించారు. బాత్‌రూమ్‌లు క్లీనింగ్ చేయించాలని, రక్షిత మంచినీరు పిల్లలకు సరఫరా చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్సీ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, శ్లాబు పెచ్చులు ఊడి పడటం, అపారిశుధ్యంపై మంత్రి సుభాష్ అసహనం వ్యక్తంచేశారు. విద్యార్థులకు వండిపెడుతున్న బియ్యం తనిఖీ చేశారు. నూకలు బియ్యం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్నబియ్యం పెడతామని చెప్పి నాసిరకం బియ్యం ఇచ్చారని గత వైసీపీ ప్రభుత్వంలో అన్ని శాఖల్లోను అవినీతి పేరుకుపోయిందని ఆరోపించారు. డిగ్రీ కళాశాల, ఎస్సీ వసతి గృహం వెనుక పారిశుధ్యం దారుణంగా ఉండడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గంటల వ్యవధిలో పారిశుధ్యం మెరుగుపరచాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణానికి రూ.5 కోట్లు కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు అయిన పక్షంలో పనులు చేపట్టడంపై మంత్రి సుభాష్ ప్రిన్సిపాల్ కేసీ సత్యలత, కమిటీ సభ్యులు గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, శిష్ట్లా అమ్మన్న పంతులు, మేడిశెట్టి శేషారావులతో చర్చించారు. రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం సచివాలయం తనిఖీ చేసి సిబ్బంది వేళకు రాకపోవడం అధికారులకు ఫోన్ చేసి ప్రశ్నించారు. పంచాయతీలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలు పెట్టకపోవడంపై సుభాష్ ప్రశ్నించారు.

అయిదేళ్లూ అరాచకం

- నేడు కాకినాడ జిల్లా రైసుమిల్లర్లతో పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల సమీక్ష
- జిల్లాలో అయిదేళ్లుగా మిల్లుల అక్రమాలపై కన్నెత్తే నాథుడే కరువు
- ధాన్యం కొనుగోళ్లు, రవాణాలో ఎంత అవినీతి జరిగినా మిల్లుల్లో తనిఖీలు నిల్
- రైస్‌మిల్లులన్నీ ద్వారంపూడి కుటుంబం కనుసన్నల్లో ఉండడంతో అధికారుల్లో వణుకు
- ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో మిల్లుల్లో మోసాలపై తనిఖీకి జేసీకి సైతం వణుకు
- అనేక మిల్లుల్లో యథేచ్ఛగా రేషన్‌బియ్యం రీసైక్లింగ్ ● కీలక అధికారులకు లక్షల్లో ముడుపులు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో అనేక రైసు మిల్లులు అక్రమాలకు అడ్డాగా మారాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో ధాన్యం కొనుగోలు, రవాణా సమయంలో రైతులను నిలువునా మోసం చేస్తున్నాయి. పౌరసరఫరాల సంస్థకు ధాన్యం సేకరణకు సంబంధించి బ్యాంకు గ్యారెంటీలు(బీజీ) సమర్పించే దగ్గర నుంచి సీఎంఆర్ ధాన్యం స్థానంలో ఒడిషా బియ్యం అంటగట్టినా అడిగే నాథుడే లేరు. కాకినాడజిల్లాలో ఎన్నో ఏళ్లుగా రైసుమిల్లులకు ద్వారంపూడి కుటుంబమే జిల్లా అధ్యక్షులుగా కొనసాగుతోంది. వైసీపీ పాలనలో జిల్లా, రాష్ట్ర అధ్యక్ష పదవులు ఈ కుటుం బమే అనుభవించింది. అటు ద్వారంపూడి తండ్రి పౌరసరఫరాల సంస చైర్మన్‌గా వ్యవహరించారు. దీంతో జిల్లాలో రైసుమిల్లర్లు అంతా ఈ కుటుంబం కనుసన్నల్లోనే ఉండేవారు. కప్పాలు, అమ్యామ్యాలు వీరు ఎంత అడిగితే అంత సమర్పించాల్సిందే. దీంతో జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులు ద్వారంపూడి కుటుంబానికి భయపడి ఏనాడు ఏ మిల్లుపైనా దాడి చేయడానికి సాహసించలేదు. వాస్తవానికి జిల్లాలో సార్టెక్స్, ఫోర్టిఫైడ్ రైసు మిల్లులు 210కిపైనే ఉన్నాయి. వీటిలో ఖరీఫ్ ధాన్యం సేకరణలో ఆర్‌బీకేలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని తీసుకుని మర ఆడించి ఇవ్వాలి. కానీ అదే సమయంలో పలు మిల్లులు ఒడిషా నుంచి కారుచౌకగా ధాన్యం కొనుగోలుచేసి మర ఆడించి తీసుకున్న ధాన్యం రకం బదులు ఒడిషా ధాన్యం మర ఆడించి అంటగడుతున్నాయి. ఇలా మిగుల్చుకున్న జిల్లాలో పండిన బియ్యాన్ని పాలిష్‌చేసి విదేశాలకు ఎగుమతి చేస్తూ కోట్లలో సంపాదిస్తున్నాయి.

తనిఖీల ఊసే లేదు..

జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్‌లో రైసుమిల్లుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ఎంత ధాన్యం వెళ్లిందో అంతే నిల్వ ఉండాలి. కానీ దీనికి సమానంగా ఒడిషా ధాన్యం ఉంటున్నాయి. వీటిని తనిఖీచేసి స్వాధీనం చేసుకుని మిల్లులపై కేసులు నమోదు చేయాలి. కానీ ద్వారంపూడి కుటుంబానికి భయపడి జిల్లా పౌరసరఫరాల సంస్థ డీఎం నుంచి జాయింట్ కలెక్టర్ వరకు మిల్లులవైపు కన్నెత్తి చూడ్డానికి కూడా గత అయిదేళ్లలో సాహసించలేదు. కానీ ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో మిల్లర్ల నుంచి జిల్లావ్యాప్తంగా కోట్లలో ముడుపులు వసూలుచేసి ఆయా కీలక అధికారులకు చదివించడం మామూలుగా వస్తోంది. దీంతో జిల్లాలో మిల్లులపై దాడులు అనే సంగతే అంతా మర్చిపోయారు. రేషన్ బియ్యం కాకినాడజిల్లాలో ద్వారంపూడితోపాటు ఆయన కుటుంబం ఆశీస్సులు ఉన్న పలు మిల్లుల్లో యథేచ్ఛగా రీ సైక్లింగ్ జరిగిపోతోంది. కానీ ఏనాడు అధికారులు ఏ మిల్లు వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో అనేక మిల్లుల్లో రేషన్ దందా, ధాన్యం దందా యథేచ్ఛగా జరుగుతోంది. కొన్ని మిల్లులు నిబంధనల ప్రకారం వ్యవహరించినా ద్వారంపూడి కుటుంబాన్నికాదని మిల్లులు నడిపించే పరిస్థితిలేదు. గట్టిగా ప్రశ్నిస్తే అధికారుల ద్వారా దాడులు, లేదా ధాన్యం సేకరణనుంచి తప్పించడం చేస్తారనే భయం భయంతో నడుస్తున్నాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పౌరసరఫరాలశాఖ మంత్రిగా నాదెండ్ల శనివారం కలెక్టరేట్‌లో మిల్లర్లతో సమీక్ష నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో మిల్లర్ల అక్రమాలపై గట్టిగా ప్రశ్నించడంతోపాటు నిబంధనలు, మోసాలకు పాల్పడే మిల్లులను సీజ్ చేసేలా ఆదేశాలు జారీ చేయాల్సి ఉంది. జిల్లాలో మిల్లులపై ద్వారంపూడి కుటుంబం పెత్తనం ఉన్నంతకాలం రేషన్ బియ్యం మాఫియా, ధాన్యం కొనుగోలులో మిల్లుల మతలబులు ఆగే పరిస్థితిలేదని అధికారులే చెబుతున్నారు. మరోపక్క గడచిన ఐదేళ్లలో పౌరసరఫరాల సంస్థ డీఎం, జేసీ, ఇతర రెవెన్యూ అధికారులు ఎన్ని మిల్లుల్లో తనిఖీలు చేశారనేది నిలదీస్తే బండారం అంతా బయటపడ నుంది. జిల్లాలో మిల్లర్లకు రావాల్సిన బకాయిల్లోను ద్వారంపూడి కుటుంబం కమీషన్లు భారీగా కొట్టేసింది. బిల్లులు ఇప్పించే పేరుతో పర్సంటేజీలు బాదేసి కోట్లలో ఆర్జించిందని మిల్లర్లే లబోదిబోమంటున్నారు.


నడకుదురులోని గోదామును తనిఖీచేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

నడకుదురులో గోదాముల తనిఖీ

- మంత్రి ఆదేశాలతో రూ.13.50కోట్ల సరుకు సీజ్

కరప, జూన్ 28: రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం సాయంత్రం కాకినాడ జిల్లా కరప మండలం నడకుదురులోని లావన్ ఇంటర్నేషనల్ సంస్థకు చెందిన గోదాములను తనిఖీచేశారు. గోదాములలోని పీడీఎస్ రైస్‌ను పాలిస్ పట్టించినట్టుగా గుర్తించిన మంత్రి రికార్డులను తనిఖీచేశారు. గోదాములోని నిల్వలకు, రికార్డులకు పొంతన లేకపోవడంతో బాటు పలు అవకతవకలను పసిగట్టిన మంత్రి గోదాములను సీజ్‌చేసి మొత్తం వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు రెండు గోదాములలో ఉన్న, బయట లారీల్లో ఎక్కించిన బియ్యం, నూక, ఇతర సరుకులను లెక్కించారు. చివరకు రూ.13కోట్ల40లక్షల59వేల570ల విలువ కలిగిన 4,531.14 టన్నుల సరుకును సీజ్‌చేశారు. అలాగే ఉప్పలంకలోని సరళ ఫుడ్స్ రైస్‌మిల్లును మంత్రి తనిఖీచేసి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దాన్ని కూడా సీజ్‌చేయాలని ఆదేశించారు. ఈ రైస్‌మిల్లులోని వివిధ రూపాల్లో ఉన్న సరుకును కూడా అధికారులు లెక్కిస్తున్నారు. తహశీల్దార్ వి.రామకోటేశ్వరరావు, ఆర్ఐ మాచరరావు, వీఆర్‌వో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

1న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, జూన్ 28: వికాస ఆధ్వర్యంలో జూలై 1న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కాకినాడ వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో భవి క్రియేషన్స్ కంపెనీలో సోషల్ మీడియా మేనేజర్, కాశీస్వరి రిఫైనరీ ఇండస్ట్రీస్‌లో టెక్నీషియన్, శ్రీగోపాల్ ఆటోమోటివ్ కంపెనీలో సేల్స్ రిప్రజెంటేటివ్, అసిస్టెంట్ మేనేజర్, బాలాజీ కెపిటల్‌లో ఫైనాన్షియల్ అడ్వయిజర్, టెలీకాలర్స్, డేటా సోర్సింగ్ ఆఫీసర్, యాక్సిస్ బ్యాంకులో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, డెక్కన్‌కెమికల్స్ ట్రైనీ ప్రొడక్షన్, కో-జెంట్ ఈ సర్వీసెస్ కంపెనీలో బీపీవో, రాక్‌మెన్ ఇండస్ట్రీస్‌లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణులైన 35ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12వేల నుంచి రూ.20వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 77993 76111లో సంప్రదించాలన్నారు.

పీఏసీఎస్‌లకు సహకార శాఖాధికారులు పీఐసీలుగా నియామకం

కాకినాడరూరల్, జూన్ 28: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా డీసీసీబీ పరిధిలోని సహకార సంఘాల సొసైటీలకు గతంలో నియమించిన కమిటీలు రద్దయ్యాయి. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో సంబంధిత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేవరకూ వాటి పాలనా బాధ్యతలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా పరిధిలో గల 298 పీఏసీఎస్‌లకు సహకార శాఖాధికారులను పీఐసీ(పర్సన్ ఇన్‌ఛార్జ్)లుగా నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వారి పదవీకాలం లేదా పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించేవరకూ పీఐసీలను కొనసాగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాల్లో ఖరీఫ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు రుణాలు, విత్తనాలు, ఎరువుల పంపిణీకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు పీఐసీలను నియమిస్తున్నట్లు జీవోలో పేర్కొన్నారు.దీంతో సహకారరంగంపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించినట్లయింది.


పిఠాపురం ఉప్పాడ సెంటర్‌లో డిప్యూటీ సీఎం పవన్ నిర్వహించే సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టరు సగిలి షాన్ మోహన్

పవన్ పర్యటన
ఏర్పాట్లపై కలెక్టరు సమీక్ష

- సభ నిర్వహించే ప్రాంతం పరిశీలన

పిఠాపురం, జూన్ 28: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్ సమీక్ష నిర్వహించారు. పిఠాపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం వచ్చేనెల 1న తొలిసారి నియోజకవర్గానికి రానున్నారు. ఈ సందర్భంగా ఉప్పాడ సెంటర్‌లో జరిగే వారాహి సభలో పవన్ పాల్గొననున్నారు. పవన్ సభ నిర్వహించే ప్రాంతాన్ని కలెక్టరు పరిశీలించారు. వారాహి సభకు సంబంధించిన వివరాలపై అధికారులను ఆరా తీశారు. సభకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లుపై కలెక్టరు పలు సూచనలు చేశారు. ఎన్నికల్లో విజయం అనంతరం పవన్ నిర్వహిస్తున్న తొలి బహిరంగ సభ కావడంతో భారీఎత్తున ప్రజలు తరలివచ్చే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జడ్పీ సీఈవో రామచంద్రమూర్తి, పిఠాపురం తహసీల్దారు లక్ష్మీ, మునిసిపల్ కమిషనరు కనకారావు, సీఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పింఛన్ల పంపిణీ ఇక్కడి నుంచే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ మొత్తాలను రూ.4వేలకు పెంచడంతో పాటు ఏప్రిల్ నుంచి పెంపును అమలు చేస్తున్న నేపథ్యంలో ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.7వేలు అందించే కార్యక్రమానికి పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శ్రీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో వారాహి సభను 2వ తేదీన నిర్వహించాలని భావిస్తున్నట్లు సమాచారం.

చేపలతో నిరసన

- మార్కెట్లో సమస్యల పరిష్కారం కోరుతూ మహిళల ఆందోళన



చేపలతో ఆందోళన చేస్తున్న మహిళలు, వారితో మాట్లాడుతున్న కమిషనర్ రామకృష్ణ, పోలీసులు

యానాం, జూన్ 28: చేపలను విక్రయించే మహిళలు మార్కెట్లో సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పరిపాలనాధికారి కార్యాలయం ఎదురుగా చేపల బుట్టలు పెట్టి సమస్యలను పరిష్కరించాలని రోడ్డుపై బైఠాయించారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవట్లేదంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనరు ఖండవల్లి రామకృష్ణ, ఎస్ఐ ముగురనందం వచ్చి మహిళలతో మాట్లాడారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను వారు అధికారులకు వివరించారు. ముఖ్యంగా రబ్బరుమ్యాట్‌లు లేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, నిత్యం ఎవరో ఒకరు గాయాలపాలవుతున్నారన్నారు. రాత్రి సమయంలో జరుగుతున్న దొంగతనాలను అరికట్టాలన్నారు. మార్కెట్లో దాచుకున్న చేపలను అపహరించుకుపోతున్నారన్నారు. సాయంత్రం పలువురు మద్యం సేవించి వికృత చేష్టలు చేస్తున్నారన్నారు. మార్కెట్ చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలన్నారు. కుళాయిలు, ఫ్యాన్లు వేయాలని, చేపలు శుభ్రం చేస్తున్న వారికి షెడ్డు నిర్మించాలని కోరారు. యానాం మార్కెట్లోని చేపలు మాత్రమే విక్రయించాలని, బయటి ప్రాంతాల చేపలు విక్రయించకుండా చూడాలన్నారు. సమస్యలను వారంలో పరిష్కరి స్తామని కమిషనరు హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.అధికారులు మార్కెట్‌ను పరిశీలిస్తున్న సమయంలోనే రత్నం అనే మహిళ జారిపడింది. గాయాలపాలైన ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


వంతెన నిర్మాణాన్ని మ్యాప్ ద్వారా వివరిస్తున్న పంచాయతీరాజ్ ప్రాజెక్టు డీఈ అన్యం రాంబాబు

బిల్లుల మంజూరులో జాప్యం

- ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాను: ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, జూన్ 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం గంటి పెదపూడి, ఉడిమూడి పంచాయతీ పరిధిలో వంతెన నిర్మాణానికి సం బంధించిన బిల్లుల మంజూరులో జాప్యాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.12 కోట్లు మంజూరయ్యేలా కృషిచేస్తానని చెప్పా రు. రూ.49.50కోట్లతో నిర్మిస్తున్న వంతెన డిజైన్ మ్యాప్‌ను శుక్రవారం ఆయన జనసేన క్యాంపు కార్యాలయంలో అధికారుల సమక్షంలో పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మా ట్లాడుతూ లంక గ్రామాలకు వంతెన నిర్మాణం దశాబ్దాల కలగా మిగిలిపో యిందన్నారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని అధికారులకు సూచించారు. వంతెన నిర్మాణంలో ఇప్పటివరకు దాదాపు మూడు పిల్లర్లు, రెండు వెల్స్ పూర్తయ్యాయని ప్రాజెక్టు డీఈ అన్యం రాంబాబు ఎమ్మెల్యేకు వివరించారు. లంక గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ ఆవశ్యకతను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా న్నారు. ఏఈఈ దుర్గా కొండలరావు, ఏఈ గంగాధర్, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరావు, ఎంపీటీసీ ఆదిమూలం సూరయ్య కాపు, తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తలను ఢీకొట్టిన లారీ

- భర్త అక్కడికక్కడే మృతి
- భార్యకు తీవ్ర గాయాలు..
- ఆసుపత్రికి తరలింపు.. పరిస్థితి విషమం


వానపల్లి ప్రధాన రహదారి మలుపులో భార్యాభర్తలను ఢీకొట్టిన లారీ, ఇన్‌సెట్‌లో మృతుడు శ్రీనివాసపల్లంరాజు (ఫైల్)

కొత్తపేట, జూన్ 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లి ప్రధాన రహదారి మలుపులో శుక్రవారం జరిగిన ప్రమాదంలో భర్త అక్కడికక్కడే మృతిచెందగా భార్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. కొత్తపేట ఎస్ఐ ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... వానపల్లి సంగం పాలేనికి చెందిన యిళ్ల శ్రీనివాసపల్లంరాజు (49) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఇతనికి శుక్రవారం మధ్యాహ్నం పొలంలో విషపు పురుగు కుట్టినట్టు అనుమానం రావడంతో స్నేక్ వీనమ్ వ్యాక్సిన్ కోసం భార్య నారాయణమ్మతో కలిసి వానపల్లి పీహెచ్‌సీకి బయల్దేరాడు. వ్యాక్సిన్ అందుబాటులో లేదని, కొత్తపేట ప్రభుత్వాసుపత్రిలో ఉందని అక్కడి సిబ్బంది తెలిపారు. దీంతో దంపతు లిద్దరూ మోటారు సైకిల్‌పై కొత్తపేట ప్రభుత్వాసుత్రికి వెళ్లి వ్యాక్సిన్ చేయించుకుని ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యంలో వానపల్లి మలుపువద్ద కాత్రేనికోన నుంచి ధాన్యం లోడుతో ద్వారపూడి వెళ్తున్న లారీ వీరిని ఢీకొట్టింది. శ్రీనివాసపల్లంరాజు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు, తలకు తీవ్ర గాయాలైన నారాయణమ్మను అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడికి వరుసకు తమ్ముడైన యిళ్ల నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు

- కాకినాడ టౌన్ బ్యాంక్ చైర్మన్ రవీంద్ర

కాకినాడ సిటీ, జూన్ 28: ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందజేస్తామని ది కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ చైర్మన్ చిట్టూరి రవీంద్ర అన్నారు. కాకినాడ రాజాట్యాంక్ ఆవరణలోని ఫ్యాబిన్ కన్వెన్షన్ హాల్‌లో బ్యాంకు 45వ వార్షిక మహాజన సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రవీంద్ర మాట్లాడుతూ సభ్యులకు 15శాతం డివిడెండు చెల్లించనున్నట్లు వెల్లడించారు. రూ.1753కోట్ల టర్నోవర్‌తో రాష్ట్రంలో టౌన్ బ్యాంక్ 2వ స్థానంలో ఉందన్నారు. ఈఏడాది మార్చి 31నాటికి డిపాజిట్లు రూ.1,056.73కోట్లు, లోన్లు రూ.696.47 కోట్లు, ఇన్‌వెస్ట్‌మెంట్లు రూ.447.35కోట్లు, బ్యాంకు సొంత నిధులు రూ.172.13కోట్లు ఉన్నాయన్నారు. మహాజన సభలో బ్యాంకు సీఈవో సి.సుగుణారావు ప్రవేశపెట్టిన వివిధ అజెండా అంశాలను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో బ్యాంక్ ఉపాధ్యక్షుడు తోట సుధీర్, డైరెక్టర్లు కంటిపూడి సత్యనారాయణ, జీఏ కళ్యాణ్ ప్రసాద్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ టౌన్ బ్యాంక్ చైర్మన్ రవీంద్ర

శ్రీరామగిరి ఆలయంలో వాహన విగ్రహాలు చోరీ


ఆలయంలో విచారణచేపడుతున్న ఎస్ఐ నాగరాజు
అపహరణకు గురైన వాహన విగ్రహాలు (ఫైల్)

వరరామచంద్రాపురం, జూన్ 28: మండలంలోని రెండవ భద్రగిరిగా పేరుగాంచిన శ్రీరామగిరి ఆలయంలోని వాహన విగ్రహాలు (ఇత్తడి) గురువారం రాత్రి చోరీకి గురయ్యాయి. ఆలయంలో పనిచేస్తున్న స్వీపర్ ఉదయాన్నే ఆలయానికి వెళ్లగా వాహన విగ్రహాలు లేకపోవడంతో అతను గ్రామస్తులకు తెలిపారు. గ్రామస్తులు వెళ్లి చూడగా విగ్రహాలు అపహరణకు గురయ్యాయని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచాలం ఇచ్చారు. దీంతో ఎస్ఐ నాగరాజు తన సిబ్బందితో శ్రీరామగిరి ఆలయానికి చేరుకొని గ్రామస్తులను, ఆలయ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. చోరీకి గురైన ప్రదేశాన్ని క్షుణంగా పరిశీలించారు. అపహరణకు గురైన విగ్రహాలు 500 సంవత్సరాల చరిత్ర కలిగిన అ త్యంత పురాతనమైన గరుడ, అశ్వం ఆంజనేయస్వామి వాహన విగ్రహాలు. అవి ఇత్తడి, లోహంతో తయారుచేసిన విగ్రహాలు అని గ్రామస్తులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపడతామని ఎస్ఐ తెలిపారు. ఎస్ఐతోపాటు ఆలయ చైర్మన్ రేవు బాల రాజు, జడ్పీటీసీ సభ్యుడు వాళ్ళ రంగారెడ్డి, టీడీపీ నాయకులు ముత్యాల రామారావు, ఆచంటి శ్రీను, బొర్రా నరసింహారావు గ్రామస్తులు పాల్గొన్నారు.

సీలేరు నదిలో బాలుడు గల్లంతు


సీలేరు నదిలో గల్లంతైన బాలుడు (ఫైల్)

చింతూరు, జూన్ 28: ప్రమాదవశాత్తు ఒక బాలుడు సీలేరునదిలో పడి గల్లంతయ్యాడు. చింతూరు మండలం మోతుగూడెం పోలీసుస్టేషను పరిధిలోని కొత్తపల్లిలో శుక్రవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. ఒడిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా మడతల్ గ్రామానికి చెందిన సోయం ముఖేష్ తన కుమారుడు సింకుని వెంట బెట్టుకొని చింతూరు మండలం, కొత్తపల్లిలోని తమ బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వచ్చాడు. కాగా కొత్తపల్లి సీలేరు నదిని ఆనుకొని ఉండడంతో నది వద్దకు కొంతమందితో కలసి వెళ్లిన సింకు(7) ప్రమాదవశాత్తు నదిలో పడిపోయాడు. దీంతో నది ప్రవాహంలో సింకు కొట్టుకుపోయాడు. సింకుకోసం గ్రామస్థులు గాలించినప్పటికీ ఆచూకీ కానరాలేదు.

గోదావరిలో దూకిన మహిళ సురక్షితం

- సమయానికి స్పందించిన పోలీసులు


గోదావరిలో మహిళను రక్షిస్తున్న జాలర్లు



రాజమహేంద్రవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): శుక్రవారం సాయంత్రం 5గంటల సమయం.. ఓ మహిళ ప్రాణాలు తీసుకో వడానికి గోదావరిలో దూకింది.. అది చూసి అటుగా వెళ్తున ఓ వ్యక్తి పోలీ సులకు ఫోన్ చేశారు.. వెంటనే పోలీసులు స్పందించారు.. జాలరుల సహాయంతో బోటులో వెళ్లి ఆమెను రక్షించారు. టూటౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరంలోని మల్లికార్జున నగర్‌కి చెందిన దూడల నాగలక్ష్మికి తన భర్తతో డబ్బుల విషయంలో గొడవ జరిగింది. దీంతో ఆమె రోడ్‌కం రైలువంతెనపైకి చేరుకొని గోదావరిలో దూకేళ్లింది. అటుగా వెళ్తున్న వ్యక్తి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. తక్షణమే ఎస్ఐ రత్తయ్య, కానిస్టేబుల్ లీలాకుమార్ అప్రమత్త మయ్యారు. అక్కడికి దగ్గరి రేవులోని జాలరులకు సమాచారం ఇస్తూనే ఘటనా ప్రదే శానికి బయలుదేరారు. నీటిపై తేలుతున్న ఆ మహిళ వద్దకు బోటులో జాలరులతో వెళ్లి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. నాగలక్ష్మికి కౌన్సెలింగ్ ఇచ్చి సంబంధీకులకు అప్పగించామని సీఐ తెలిపారు. విధుల్లో ప్రతిభ చూపిన ఎస్ఐ, కానిస్టేబుల్‌ని ఎస్పీ జగదీశ్ ప్రత్యేకంగా అభినందించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ప్రమాదం

- ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఉమామహేశ్వరరావు, గాయపడ్డ ప్రకాష్

అమలాపురంరూరల్, జూన్ 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ ఈదరపల్లి 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఫీడర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గుడాల ఉమామహేశ్వరరావుకు తీవ్ర గాయాలు కావడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లాలని అమలాపురం ఏరియా ఆసుపత్రి వైద్యులు సూచించారు. సబ్‌స్టేషన్‌లో అవుట్ సోర్సింగ్ విభాగంలో షిఫ్ట్ ఆపరేటర్, అసిస్టెంట్లయిన ఉమామహేశ్వరరావు, వి.ప్రకాష్ అంబాజీపేట ఫీడర్ ట్రిప్ కావడంతో ఎల్‌సీ ఇచ్చి పనులు చేపట్టారు. అదే సమయంలో ఉప్పలగుప్తం ఫీడర్ కూడా ఎల్‌సీ కోరారు. ఆ సమయంలో ఎర్త్ రాడ్స్ మెయిన్‌లైన్‌కు తగలడంతో ఒక్కసారిగా మంటలు ఎగసి పెద్ద శబ్దంతో పేలింది. ఈ ప్రమాదంలో ఉమామహేశ్వరరావుకు తీవ్ర గాయాలు కాగా, ప్రకాష్ స్వల్పంగా గాయపడ్డాడు. వారిద్దరినీ చికిత్స నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటనా ప్రాంతాన్ని ట్రాన్స్‌కో డీఈ హేమలత, ఏడీఈ భగవాన్ పరిశీలించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టి గాయపడ్డ వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

మధ్యప్రదేశ్ నుంచి గోధుమలు దిగుమతి

సామర్లకోట, జూన్ 28: సామర్లకోట రైల్వే గూడ్స్ యార్డుకు మధ్యప్రదేశ్ నుంచి శుక్రవారం 1,800మెట్రిక్ టన్నుల గోధుమలు దిగుమతులు అయ్యాయి. మధ్యప్రదేశ్ నుంచి గోధుమలు రవాణాకు వినియోగించిన గూడ్స్‌రైలు సామర్లకోటకు చేరుకుంది. సామర్లకోట ఏడీబీ రోడ్డులో లలితా ఎంటర్‌ప్రైజెస్ పరిశ్రమ ఈ గోధుమలను దిగుమతులు చేసుకుంది. రైల్వేకు రవాణా చార్జీలుగా రూ.35లక్షల మేర చెల్లించినట్లు సమాచారం. గోధుమలు సామర్లకోటలో దిగుమతులు, తిరిగి లారీల ద్వారా ఎగుమతులుకు చెందిన సుమారు 100 లారీలకు రవాణా చార్జీలుగానూ, దిగుమతులు, ఎగుమతులు ద్వారా హమాలీలు సుమారు 150మందికి ఉపాధి లభించినట్లైంది. సామర్లకోట పరిసరాలలో పరిశ్రమలకు మరో 30వేల మెట్రిక్ టన్నుల మేర గోధుమలు దిగుమతులు కాగలవని రైల్వే అధికారులు చెప్పారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, జూన్ 28: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన కె.సుధారాణి రూ.1,00,400 విరాళంగా సమర్పించారు. ఈమొత్తాన్ని దాత ఏపీఆర్వో గణపతికి అంద జేశారు. దాతను ఆయన అభినందించి వారికి స్వామి వారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు.

పొగాకు అ'ధర'హో..

- సిరులు కురిపిస్తున్న పొగాకు సాగు ● వర్జీనియాకు 50 ఏళ్లలో అత్యధిక ధర


గోపాలపురం వేలం కేంద్రంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పొగాకుబేళ్లు

గోపాలపురం, జూన్28: ఏజెన్సీ మెట్టప్రాంత రైతాంగానికి పొగాకు సాగు సిరులు కురిపిస్తుంది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో తేలికనేలల్లో పండే వర్జీనియ పొగాకుపంట లేకపోతే రైతులతో పాటు రైతుకూలీలకు ఒకప్పుడు పని ఉండేది కాదు. ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంట అయిన వర్జీనియా పొగాకు గత 50ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక ధర పలుకుతుంది. ఈ ప్రాంతంలో పండేపంట దేశంలోనే నాణ్యమైనది కావడంతో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఈ రాష్ట్రంలో పండే పొగాకు పంటకు ధరలో వ్యత్యాసం పలుకుతోంది. గతంలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన పొగాకు రైతాంగం అప్పులు తీరగా రెండో ఏడాది పంట వేయకతప్పదం లేదనే భావనలో ఉన్నారు. రెండేళ్ల నుంచి పొగాకు సాగు ప్రా రంభం నుంచి ఎన్నడు లేని ధరలు కిలో పొగాకు ధర రూ.368 పలికింది. దీంతో తమ కష్టానికి తగిన ఫలితం చూస్తున్నామనే భావనతో పొగాకు రైతు కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. పంటలకు గిట్టుబాటు ధర రావడంతో రైతులు, రైతుకూలీలు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

ధరకు తగ్గ దిగుబడి లేదు

- ముళ్ళపూడి శివాజీ, పొగాకు రైతు, చెరుకుమిల్లి

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది తుఫాన్ ప్రభావంతో పెట్టుబడికి తగిన దిగుబడి రాలేదు. అయితే పొగాకు సాగు చేసే రైతులకు పెట్టుబడుల నుంచి బయటపడే అవకాశం ఉంది.

ధరల పెంపుతో ఊరట

- కొడవటి చినవెంకటేశ్వరరావు, పొగాకు రైతు, గోపాలపురం.

పొగాకు సాగు ప్రారంభం నుంచి ఇప్పటి వరకు చరిత్రలో ఎన్నడు లేని విధంగా సన్న, చిన్నకారు రైతులు పొగాకు ధరతో ఊపిరి పీల్చుకున్నారు. నష్టాల బారిన పడి ఆత్మహత్యలు చేసుకుందామనే స్థితి నుంచి కుటుంబ సమేతంగా గుప్పెడు మెతుకులు తింటున్నామన్న భావం వచ్చింది. పొగాకు ధరలు పెరగడం చిన్న, సన్నకారు రైతులకు ఊరటనిచ్చినట్లయ్యింది.

అట్టహాసంగా అన్నవరం దేవస్థానం
వ్రతపురోహిత యూనియన్ ప్రమాణస్వీకారం

అన్నవరం, జూన్ 28: ఇటీవల ఎన్నికైన అన్నవరం దేవస్థానం వ్రతపురోహిత యూనియన్ అధ్యక్షుడు చామర్తి కన్నబాబు, కార్యదర్శి సవితాల వీరబాబు, కోశాధికారి మెకరాల రాజేష్‌లు శుక్రవారం సాయంత్రం యూనియన్ సభ్యుల సమక్షంలో ప్రమాణస్వీకారం అట్టహాసంగా జరిగింది. ఈసందర్భంగా అధ్యక్షుడు కన్నబాబు మాట్లాడుతూ అన్నవరం దేవస్థానం వ్రతపురోహితుల ద్వారా దేవస్థానం ఖ్యాతిని మరింత ఇనుమడింపచేసి సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో వ్రతపురోహిత సూపర్‌వైజర్లు, సభ్యులు పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న వ్రతపురోహిత యూనియన్ నాయకులు


జ్వరపీడితురాలితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో దుర్గారావుదొర

'ఇంటింటికీ వెళ్లి రక్తనమూనాలు సేకరించాలి'

పి.గన్నవరం, జూన్ 28: మండలంలోని బెల్లంపూడిలో విషజ్వరాలు ఎక్కువగా ఉన్నందున ఇంటింటికీ వెళ్లి రక్తనమూనాలు సేకరించాలని స్థానిక వైద్యాధికారులను జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర ఆదేశించారు. శుక్రవారం ఆయన బెల్లంపూడి శివారు ఇందిరమ్మ కాలనీలో జ్వరపీడితులతో మాట్లాడారు. సీజనల్ వ్యాధులపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానం ఉన్నచోట విధిగా పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. సర్పంచ్ బండి మహలక్ష్మి, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ శామ్యూల్‌రాజు, ఎస్.రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ కె.శిరీష, ఏఎన్ఎం వైకే ప్రియాంక, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


వేగుళ్లకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు

ఎమ్మెల్యే వేగుళ్లకు సత్కారం

మండపేట, జూన్ 28: మండపేట ఎమ్మెల్యేగా నాలుగోసారి విజయం సాధించిన వేగుళ్ల జోగేశ్వరరావును టీడీపీ కార్యాలయంలో ముస్లింలు శుక్రవారం ఘనంగా సత్కరించారు. టౌన్ బ్యాంకు పాలకవర్గ చైర్మన్, సభ్యులు కూడా వేగుళ్లను కలిసి సత్కరించారు. టీడీపీ యువ నేత వి.సాయికుమార్ బాబు, టౌన్ బ్యాంకు చైర్మన్ అగస్త్యరాజు, దంటు సూర్యనారాయణ, చిర్ల రామన్న, వీర రుద్ర, నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


గ్రాడ్యుయేషన్ డే వేడుకలో పాల్గొన్న చిన్నారులు

అంగన్‌వాడీల్లో గ్రాడ్యుయేషన్ డే

మలికిపురం, జూన్ 28: అంగన్‌వాడీల ద్వారా పిల్లలకు మానసిక పరిపక్వత ఏర్పడుతుందని సీడీపీవో వైకేడీ రమాదేవి అన్నారు. ఉయ్యూరిమెరక సెక్టార్ పరిధిలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ప్రీ స్కూలులో విద్య ముగించిన విద్యార్థులకు పత్రాలు అందజేశారు. సర్పంచ్ ఓగూరి రత్నకుమారి, ఎంపీడీవో అంజిబాబు, సూపర్‌వైజర్ కె.చంద్రకళ, అంగన్‌వాడీ కార్యకర్తలు రత్నకుమారి, పద్మావతి, నాగమ్మ, జ్యోతి, కుమారిదుర్గ, శేషవేణి, కిరణ్‌జ్యోతి, తల్లుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొదటి రోజే నూరు శాతం

పింఛన్లు పంపిణీ చేయాలి

అల్లవరం, జూన్ 28: ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మొదటి రోజే నూరు శాతం పంపిణీ చేయాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ కోరారు. శుక్రవారం ఆయన మండల పరిషత్ కార్యాలయం వద్ద పింఛన్ల పంపిణీపై శిక్షణ ఇచ్చారు. బయోమెట్రిక్, మొబైల్స్ సిద్ధంగా ఉంచాలన్నారు. మండలంలోని 23 సచివాలయాల పరిధిలో 9,517 పింఛన్లను లబ్ధిదారులకు ఇళ్ల వద్దే అందించాలన్నారు. పీఆర్ ఏఈ జి.సంపన్, బి.లక్ష్మణరావు, ఈవోపీఆర్డీ ఎన్వీవీ సత్యనారాయణ, పంచాయతీల కార్యదర్శులు ఎస్.రాజమోహన్, అడబాల శ్రీరామచంద్రమూర్తి, ఎస్.దుర్గాశ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్రేయపురం: మండలంలోని 17 గ్రామాల్లో 9,850 మందికి జూలై 1న పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామని ఎంపీడీవో ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. 197 మంది సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేస్తారని చెప్పారు.

అంబాజీపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో జీవీ సరోవర్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. మండలంలో 9,383 పింఛనుదారులకు రూ.6.22కోట్లు మంజూరయ్యాయన్నారు. ఒకటో తేదీన కొర్లపాటివారిపాలెంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభిస్తారని చెప్పారు.



వైభవంగా మావుళ్లమ్మ తీర్థం

అమలాపురం టౌన్, జూన్ 28: ఇందుపల్లి గ్రామ దేవత మావుళ్లమ్మవారి జాతర అనంతరం ఆలయం వద్ద తీర్థాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.

ఘనంగా బూరుగులమ్మ అమ్మవారి తీర్థం



అంబాజీపేట, జూన్ 28: పుల్లేటికుర్రు గ్రామ దేవత శ్రీ బూరుగులమ్మ అమ్మవారి తీర్థం శుక్రవారం ఘనంగా జరిగింది. గురువారం రాత్రి జాతరలో గరగ నృత్యాలు, కోయ డ్యాన్సులు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలువురు ప్రజాప్రతినిధు లతో పాటు భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

డయేరియా బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి

కపిలేశ్వరపురం, జూన్ 28: డయేరియా బారిన పడకుండా ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వాకతిప్ప పీహెచ్‌సీ సీహెచ్‌వో జి.శ్రీను కోరారు. శుక్రవారం ఆయన మండలంలోని టేకిలో ఉన్నత పాఠశాల, బీసీ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు డయేరియా పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్, బీసీ కాలనీ స్కూలు హెచ్‌ఎం కేవీ రమణ, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	--
వెంకటరమణ	కల్కి 2898 ఏడీ
శ్రీలలిత	మహారాజ
శేఖర్ స్క్రీన్-1	కల్కి 2898 ఏడీ
శేఖర్ స్క్రీన్-2	కల్కి 2898 ఏడీ
రమా	ప్రభుత్వ జూనియర్ కళాశాల
గణపతి	హరోం హర
వెంకటపద్మావతిస్క్రీన్-1	కల్కి 2898
వెంకటపద్మావతి స్క్రీన్-2	కల్కి 2898 ఏడీ

ఆన్‌లైన్ గ్రీవెన్స్‌కు ఆలోచన

మలికిపురం, జూన్ 28: రాజోలు నియోజకవర్గంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఆన్‌లైన్ గ్రీవెన్స్ చేసే ఆలోచన ఉందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన మలికిపురంలో విలేకరులతో మాట్లాడుతూ జనసేన-జనవాణి విధంగానే ఆన్‌లైన్‌లో ప్రజల నుంచి గ్రీవెన్స్ స్వీకరించి సంబంధిత అధికారులతో వారికి సమాచారం అందిస్తే బాగుంటుందనే ఆలోచన తనకు ఉందన్నారు.

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.2.31 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 28: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,31,801 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

గంజాయి జాడలు కనిపిస్తే సహించేది లేదు

రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, జూన్ 28: రాజోలు నియోజకవర్గంలో గంజాయి జాడలు కనిపిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఎల్ఏస్ ల్యాండ్ మార్కులో పోలీసు, రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. పోలీసింగ్ సక్రమంగా ఉంటే అసాంఘిక కార్యకలాపాలు జరగవన్నారు. ఎక్కడైనా గంజాయి దొరికితే వెంటనే కేసు నమోదు చేయాలని సూచించారు. మన ప్రాంతంలో తువ్వ ఇసుక అక్రమ రవాణా ఎక్కువగా ఉందని, తక్షణం ఆపాలన్నారు. సీఆర్‌జడ్ పరిధిలో కొత్త చెరువుల తవ్వకానికి అనుమతి ఇవ్వద్దన్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులను ఇసుక అక్రమ తవ్వకాలపై ప్రశ్నించగా అటువంటిదేమీ లేదని తెలుపడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వరదలు వచ్చే సమయం కావున పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బలహీనంగా ఉన్న రాజోలు, దిండి, సఖినేటిపల్లి ఏటిగట్లపై చర్చించారు. ఎటువంటి పరిస్థితి ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అవసరం మేరకు మెకనైజ్డ్ బోట్ల ఏర్పాటుపై పరిశీలించమని సూచించారు. అవసరమైతే ఓఎన్జీసీ సీఎస్సార్ నిధులతో ఏటిగట్లను పటిష్టపరుస్తామన్నారు. సమావేశాలకు అధికారులు సమగ్ర సమాచారంతో రావాలన్నారు. రాజోలు సీఐ గోవిందరాజు, ఎస్ఐలు సంపత్‌కుమార్, పృధ్వీరాజ్, తహసీల్దార్లు కె.అనితకుమారి, కె.గోపాలకృష్ణ, సీహెచ్ భాస్కర్, ఎంపీడీవో మంగాదేవి, సత్యనారాయణ, బాలాజీ, మైన్స్ ఆర్ఐ సుజాత, స్థానిక నాయకులు పినిశెట్టి బుజ్జి, గుండుబోగుల పెదకాపు, యింటిపల్లి ఆనందరాజు, రావూరి నాగు తదితరులు పాల్గొన్నారు.


పోలీసు అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్



అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే సత్యనారాయణ

మాటల ప్రభుత్వం కాదు... చేతల ప్రభుత్వం: ఎమ్మెల్యే గిడ్డి

మామిడికుదురు, జూన్ 28: తమది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని పి.గన్నవరం గిడ్డి సత్యనారాయణ అన్నారు. మామిడికుదురులో ఎంపీడీవో ఎస్.వేణుగోపాలరెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఆయన మండల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. జూలై 1న పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాసరావు, జాలెం శ్రీనివాసరాజా, మెండా ఆదినారాయణ, సర్పంచ్‌లు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల భవనాల నిర్మాణ పనులపై నిఘా

సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ మధుసూదనరావు

ఉప్పలగుప్తం, జూన్ 28: కోనసీమ జిల్లాలో ఇప్పటివరకు జరిగిన పాఠశాల భవనాల నిర్మాణ పనుల్లో నాణ్యత, ఇతర అంశాలపై ప్రత్యేక దృష్టి పెడతామని సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, డిప్యూటీ కలెక్టర్ ఎ.మధుసూదనరావు అన్నారు. 'నేను బడికి పోతా'లో భాగంగా ఎస్.కొత్తపల్లి హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమ లక్ష్యాన్ని నెరవేర్చాలని పిలుపునిచ్చారు. మండలంలో 1 నుంచి 10వ తరగతి వరకు ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య లక్ష్యం 4,435 కాగా ఇప్పటివరకు 4,153 మంది పాఠశాలల్లో చేరినట్టు ఎంఈవో కె.కిరణ్‌బాబు తెలిపారు. ఎంఈవో-2 సత్తి సత్యకృష్ణ, సమగ్ర శిక్షా సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, తహసీల్దారు మల్లికార్జునరావు, ప్రధానోపాధ్యాయుడు బి.రామకృష్ణ, బి.జాన్‌బాబు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

'వాటర్ ట్యాంకులను విధిగా శుభ్రపరచాలి'

మామిడికుదురు, జూన్ 28: గ్రామాల్లో వాటర్ ట్యాంకులను విధిగా శుభ్రపరచాలని అమలాపురం డీఎల్పీవో పి.బొజ్జిరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మామిడికుదురు, నగరం గ్రామాల్లో పర్యటించి పంచాయతీ సిబ్బందికి సూచనలిచ్చారు. అంటువ్యాధులు ప్రబలుతున్న తరుణంలో స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడాలన్నారు. సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, పంచాయతీ కార్యదర్శి పీవీఎస్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పటిష్టమైన పారిశుధ్య చర్యలు చేపట్టాలని అమలాపురం డీఎల్పీవో పి.బొజ్జిరాజు సూచించారు. శుక్రవారం ఆయన శివకోటి, చింతలపల్లి, రాజోలుల్లో వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ పనులను పరిశీలించారు. ఈవోపీఆర్డీ జి.భీమారావు, కార్యదర్శులు కోటయ్య పాల్గొన్నారు.

ఆసెట్‌లో శ్రీవెంకటేశ్వరా డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



అమలాపురం టౌన్, జూన్ 28: ఆసెట్‌లో శ్రీవెంకటేశ్వరా డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్టు కరస్పాండెంట్ కేవీఆర్ఎస్ నరసింహారావు తెలిపారు. స్టాటిస్టిక్స్ విభాగంలో కేశనకుర్తి సత్యవాణి 2వ ర్యాంకు, రాయుడు ప్రజ్ఞ 7వ ర్యాంకు, ఎస్.అయ్యప్పశర్మ 27వ ర్యాంకు, ఎ.గణేష్ 64వ ర్యాంకు సాధించారు. ప్రిన్సిపల్ కేఎస్‌వీఎన్ మనోహర్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వీరిని కరాటం ప్రవీణ్, కె.శ్రావణ్‌దిలీప్, డాక్టర్ కె.హేమవిజిత, కె.సౌందర్య, యాలంగి వరప్రసాద్, సీహెచ్ జాన్‌పాల్, ఎం.విజయలక్ష్మి, సూర్యకుమారి, ఎస్.సంసోను అభినందించారు.

'బాలికలకు రక్షణ కల్పించి అత్యాచారాలు అరికట్టాలి'

అమలాపురం టౌన్, జూన్ 28: బాలికలకు రక్షణ కల్పించే విధంగా చర్యలు చేపట్టి అత్యాచారాలు అరికట్టాలని కోరుతూ పీడీఎస్‌యూ, డీబీఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల అయినవిల్లి, మలికిపురం మండలాల్లో బాలికలపై అత్యాచారాలు జరగడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డీబీఎంఎస్ జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు వున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మామిడికుదురు, జూన్ 28: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని శ్రీచైతన్య ఏజీఎం పార్థసారథి సూచించారు. గ్రీన్ ఇండియా మిషన్‌లో భాగంగా మొక్కలు నాటి పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆర్ఐ రాజ్‌కుమార్, కో-ఆర్డినేటర్ శ్రీకాంత్, డీన్ రమేష్, సి-బ్యాచ్ ఇన్‌చార్జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'స్వయం ఉపాధికి సంప్రదించండి'

యానాం, జూన్ 28: దీనదయాళ్ అంత్యోదయ యోజన-జాతీయ పట్టణ ఉపాధి పథకం ద్వారా స్వయం ఉపాధి పొందుటకు అర్హత కలిగిన అభ్యర్థులు యానాం మున్సిపల్ కార్యాలయంలోని పూడా విభాగాన్ని సంప్రదించాలని కమిషనరు కోరారు. అర్హత కలిగిన స్వయం సహాయక సంఘం రూ.2లక్షల నుంచి రూ.10లక్షల వరకు వరకు రుణాన్ని బ్యాంకు ద్వారా పొందుటకు కార్యాలయాల పనివేళల్లో సంప్రదించాలన్నారు.

అవార్డు గ్రహీత రంగరాజుకు అభినందనలు

అంతర్వేది: టైమ్స్ నౌ ఇండియా ఇన్‌ఫ్రా ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్-2024 అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న అంతర్వేదిపాలేనికి చెందిన ఎ.రంగరాజుకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇండియన్ ఇంపాక్ట్‌బుల్ అవార్డును డాక్టర్ సంయ్ కొల్టే సీఎండీ పూణే చేతులమీదుగా ఎన్‌సీసీ, ఎల్‌టీడీ డైరెక్టర్ వినోద్‌కుమార్‌యాదవ్ అందుకున్నారు. చినచంటిరాజు, జంపన బుజ్జిరాజు, సింగరేణి కాలరీస్ డీజీఎం (పర్సనల్) ఆర్వీ రాజు హర్షం వ్యక్తం చేశారు.

హెలెన్ కెల్లర్ జయంతి

యానాం, జూన్ 28: స్థానిక ఫెర్రీ రోడ్డులోని ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో హెలెన్ కెల్లర్ జయంతి నిర్వహించారు. ఇన్‌చార్జి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వాసవి ఉమెన్ క్లబ్ అధ్యక్షురాలు సీహెచ్ సర్వలక్ష్మి పాల్గొన్నారు. హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసవి క్లబ్ ద్వారా వికలాంగులకు పుస్తకాలు, స్వీట్లు అందజేశారు. క్లబ్ సెక్రటరీ కాశి అన్నపూర్ణ, మహాలక్ష్మి, నాగలక్ష్మి, తేపిత, వెంకటలక్ష్మి, సూర్యనారాయణ, సుధాకర్, ఉపాధ్యాయులు సుశీల, మహేశ్వరి, వీరవేణి, గీత, తాతారావు తదితరులు పాల్గొన్నారు.


పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేత జంగా గౌతమ్

ఘనంగా మాజీ ప్రధాని పీవీ జయంతి

అమలాపురం రూరల్, జూన్ 28: గ్రామ సర్పంచ్ నుంచి ప్రధానమంత్రి వరకు వివిధ హోదాల్లో పనిచేసిన గొప్ప నేతగా పీవీ నరసింహారావు చరిత్రలో నిలిచిపోతారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జంగా గౌతమ్ పేర్కొన్నారు. ప్రధానిగా ఆర్థిక సంస్కరణలను తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మాజీ ప్రధాని పీవీ జయంతిని బండారులంకలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు వడ్డి నాగేశ్వరరావు, రౌతు ఈశ్వరరావు, మాచవరపు శివన్నారాయణ, ఏలేశ్వరపు రాధాకృష్ణ, పులుసుగంటి ప్రకాష్, జె.సూర్యనారాయణ, కుప్పాల రాంబాబు, మహబూబ్ షకీలా, కంటిపూడి నాగేంద్రప్రసాద్, ఆర్.కాశీవిశ్వనాథ్, వి.తమ్మిరాజు, ఎం.బాబూరావు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోలమ్మ చెరువు గట్టున గల బుద్ధవిహార్‌లో పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పి.ఉదయభాస్కరవర్మ, పెన్మెత్స జగ్గప్పరాజు, వడ్డి నాగేశ్వరరావు, పాలెపు ధర్మారావు, దివి వెంకన్నబాబు, ప్రసాద్, కాశి అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

'హెచ్‌ఎం ఆనందరావును ఆదర్శంగా తీసుకోవాలి'

పి.గన్నవరం, జూన్ 28: విద్యార్థులకు విద్యను అందించడంతో పాటు ప్రతిఏటా నోటు పుస్తకాలను ఉచితంగా అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఆనందరావును ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. పోతవరం ఎంపీపీ స్కూల్లో హెచ్‌ఎం రూ. 30వేల ఆర్థిక సాయంతో సమకూర్చిన విద్యా సామగ్రిని 84 మంది విద్యార్థులకు శుక్రవారం అందించారు. పాఠశాలలో కొత్తగా చేరిన 12 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఎమ్మెల్యేను హెచ్‌ఎం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ వడలి కొండయ్య, ఎంఈవోలు కె.హెలీనా, సీహెచ్ వీరభద్రానందం, ఎంపీటీసీ పులపర్తి రాజారావు, జనసేన జిల్లా కార్యదర్శి వాసంశెట్టి కుమార్, కూటమి నాయకులు ముంగండ శ్రీరామమూర్తి, కోలపల్లి శ్రీనివాస్, ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు ఎస్.బాలాజీ, పి.నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామాంజనేయరావు మాస్టారికి సత్కారం

అంబాజీపేట, జూన్ 28: తొండవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో సైన్సు ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన బీర శ్రీరామాంజనేయరావు సన్మాన సభ హెచ్‌ఎం పీవీ కేశవాచార్యులు అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం జరిగింది. శ్రీరామాంజనేయ దంపతులను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సత్కరించారు. జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్‌లు పేరాబత్తుల దొరబాబు, మద్దింశెట్టి దొరబాబు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, నాయకులు గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీలు చించివేత



అమలాపురం రూరల్, జూన్ 28: బండారులంక ఎన్‌కౌంటర్ బ్రిడ్జి వద్ద నుంచి ఈదరపల్లి వంతెన వరకు కూటమి నాయకులతో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు ఎక్కడికక్కడ చించివేశారు. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని ఆయన ముఖ చిత్రంతో ఉన్న ఫ్లెక్సీలను చించివేయడంపై కూటమి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దారిపొడవునా ఫ్లెక్సీలను చించివేసిన వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కూటమి నాయకులు అమలాపురం తాలూకాపోలీసులకు ఫిర్యాదు చేశారు. భవిష్యత్తులో ఈ తరహా ఘటనలు జరగకుండా చూడాలని కోరారు.

నిత్యాన్నదానానికి రూ.10వేలు విరాళం

మామిడికుదురు, జూన్ 28: అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి పాలకొల్లుకు చెందిన రాజకొండలరావు రూ.10,001 విరాళం అందించారు. తన కుమారుడు రుత్విక్ నందన్ పుట్టినరోజు అయిన జూన్ 28న ప్రతిఏటా అన్నదానం జరిపించాలని కోరారు. దాతకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాలు అందించారు.

దొంగతనం కేసులో ముద్దాయికి రెండేళ్ల జైలు

ఆలమూరు, జూన్ 28: దొంగతనం కేసులో ముద్దాయికి రెండు సంవత్సరాల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఐ.ప్రవీణ్‌కుమార్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఆలమూరు ఎస్ఐ ఎల్.శ్రీనునాయక్ తెలిపిన వివరాల ప్రకారం... ఆలమూరు మండలం గుమ్మిలేరు గ్రామానికి చెందిన రెడ్డి భాస్కరరావు ఇంట్లో పెయింట్స్ వేయడానికి వచ్చిన రాజమహేంద్రవరం ఆనంద్‌నగర్‌కు చెందిన బోడి సతీష్‌కుమార్ బంగారం, వెండి దొంగిలించినట్టు గుర్తించి 2022 మార్చి 8న అప్పటి ఎస్ఐ ఎస్.శివప్రసాద్ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో సతీష్‌కుమార్‌కి పై విధంగా శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి జైలు

ఆలమూరు, జూన్ 28: ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి ఆరు నెలల జైలు, రూ.2వేల జరిమానా విధిస్తూ ఆలమూరు కోర్టు న్యాయమూర్తి ఐ.ప్రవీణ్‌కుమార్ తీర్పు చెప్పారు. పెండింగ్ కేసులో నిందితుడిగా వున్న కామవరపుకోట మండలం పాతకొండగుడెంకు చెందిన చీకట్ల సతీష్ అనే వ్యక్తిని 2022 డిసెంబరు 16న కొత్తపేట ఏఎస్ఐ అడబాల వెంకటేశ్వరరావు ఆలమూరు కోర్టుకు తీసుకొచ్చాడు. కోర్టు ఆవరణలో ఏఎస్ఐ వెంకటేశ్వరరావుపై కేకలు వేస్తూ విధులకు ఆటంకటం కలిగించాడు. దీంతో వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు అప్పటి ఆలమూరు ఎస్ఐ శివప్రసాద్ కేసు నమోదు చేశారు. సతీష్‌కు ఆరు నెలల జైలు, రూ.2వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్టు ఆలమూరు ఎస్ఐ ఎల్.శ్రీనునాయక్ తెలిపారు.

అట్రాసిటీ కేసులో ఏడాది జైలు

ఉప్పలగుప్తం, జూన్ 28: ఉప్పలగుప్తం పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఒక ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం కోర్టు తీర్పు చెప్పింది. ఎస్ఐ కె.ఎం.జోషీ తెలిపిన వివరాల ప్రకారం... చల్లపల్లిలో సరిహద్దు వివాదంలో బుడితి వెంకటరమణ అదే గ్రామానికి చెందిన కుంపట్ల చోడేశ్వరరావుపై కుల దూషణ నేరం ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 2018లో అప్పటి ఎస్ఐ బి.రామకృష్ణ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుగా నమోదు చేశారు. నేరం నిర్ధారణ కావడంతో ముద్దాయికి ఏడాది జైలు, రూ.10వేలు జరిమానా విధిస్తూ జడ్జి ఆర్.శ్రీలత శుక్రవారం తీర్పు చెప్పారు.

ఆన్‌లైన్ యాప్‌తో మోసపోయామని ఫిర్యాదు

ద్రాక్షారామ, జూన్ 28: జీఎంఆర్ అనే ఆన్‌లైన్ మార్కెటింగ్ యాప్ ద్వారా లక్షలాది రూపాయలు మోసపోయామని 35 మంది ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2023 నవంబరులో జీఎంఆర్ అనే ఆన్‌లైన్ మార్కెటింగ్ గ్రూపును బుక్కారి ఆనంద్, మద్దాల వినయ్‌కుమార్, మోటుపల్లి కిరణ్‌కుమార్ పరిచయం చేశారు. వీఐసీ 1 మొదలుకుని వీఐపీ 9 వరకు అనేక మంది ఈ యాప్ ద్వారా చేరారని వివరించారు. ముగ్గురి ద్వారా గ్రూపులో చేరి వేలు మొదలుకుని లక్షల వరకు ఇన్వెస్ట్ చేసి నష్టపోయామన్నారు. ముగ్గురు వ్యక్తులపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.



మంత్రిని కలిసిన యూటీఎఫ్ నాయకులు

కె.గంగవరం, జూన్ 28: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను యూటీఎఫ్ మండల శాఖ నాయకులు శుక్రవారం కలిశారు. శాలువాలు కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. నాయకులు చిట్టూరి రామ్మోహన్ రావు, పి.గుణవంతుడు, దాసరి శ్రీనివాసు పాల్గొన్నారు.



మంత్రి లోకేశ్‌ను కలిసిన 'నామన'

మామిడికుదురు, జూన్ 28: ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్‌ను జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రమాణస్వీకారోత్సవంలో ఆయనతో పాటు టీటీడీ ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు డొక్కా నాథ్‌బాబు, నామన శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన మత్స్య శాఖ అధికారులు

అంతర్వేది, జూన్ 28: రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను మత్స్య శాఖ ఏడీ శ్రీనివాస్, జేడీ హర్షవర్ధన్, అంతర్వేదిపల్లిపాలెం గ్రామస్తులు శుక్రవారం కలిశారు. అంతర్వేది పల్లిపాలెంలో మినీ హార్బరును మరింత అభివృద్ధిపరచి మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని కోరారు. తిరుమాని ఆచార్యులు, మత్స్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మహా సౌర యాగంలో ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, జూన్ 28: కేశనకుర్రుపాలెంలోని శ్రీరాజరాజేశ్వరీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరుద్ర శతచండీ మహా సౌర యాగం కొనసాగుతోంది. శుక్రవారం ఈ క్రతువులో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు పాల్గొన్నారు.

సంహిత కళాశాలలో జాబ్‌మేళా

రావులపాలెం, జూన్ 28: స్థానిక సంహిత డిగ్రీ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. 235 మంది హాజరు కాగా 74 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు జిల్లా అధికారి లోకమాన్ తెలిపారు. కార్యక్రమంలో సంహిత విద్యా సంస్థల చైర్మన్ దినేష్‌బాబు, ప్రిన్సిపల్ ఎన్.నాగబాబు, రాజ్‌కుమార్, ఎ.నాగబాబు, రాజేంద్రప్రసాద్, ఏపీఎస్ఎస్‌డీసీ సిబ్బంది, కంపెనీ హెచ్‌ఆర్ సభ్యులు పాల్గొన్నారు.

బీవీసీలో అవగాహన సదస్సు

అల్లవరం, జూన్ 28: ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో సర్వీస్ నౌ సంస్థ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికల్లో సాంకేతిక అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఓడలరేవు, రాజమహేంద్రవరం, అమలాపురం బీవీసీవిద్యా సంస్థలకు చెందిన 1200 మంది విద్యార్థులకు హైదరాబాద్‌లో సర్వీస్ నౌ సంస్థ ప్రధాన కార్యాలయం శిక్షణ ఇస్తుందన్నారు. ఐటీ సర్వీస్, కస్టమ్ సర్వీస్, హెచ్‌ఆర్ సర్వీస్ సంస్థలచే శిక్షణ ఇచ్చి సాఫ్ట్‌వేర్ ఉద్యోగ సాధనకు అవకాశం కల్పిస్తామని ప్రోగ్రాం మేనేజర్ జాషువా క్యాలిన్ పేర్కొన్నారు. బీవీసీ అధినేత బోనం కనకయ్య, చైర్మన్ బోనం కృష్ణసతీష్, ప్రిన్సిపల్ డాక్టర్ వీఎస్‌పి చంద్రమౌళి, డాక్టర్ బీపీఎన్ మధుకుమార్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తొలగించండి

అభిమానులకు మంత్రి సుభాష్ సూచన

రామచంద్రపురం (ద్రాక్షారామ), జూన్ 28: రామచంద్రపురం నియోజకవర్గవ్యాప్తంగా తనకు అభినందనలు తెలుపుతూ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను తొలగించాలని మంత్రి సుభాష్ అభిమానులకు సూచించారు. ఫెక్సీల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, వెంటనే తొలగించాలని కోరారు. మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను డ్వామా పీడీ పి.మధుసూదన్ కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఏపీడీ సత్యనారాయణ, ఏపీవోలు జి.అరుణకుమారి, లక్ష్మీగణపతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారును కలిసిన హెచ్‌ఎంలు

కొత్తపేట, జూన్ 28: కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావును ఎంఈవో ఎం.హరిప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పలు పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు కూడా ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించారు.

నేడు మున్సిపల్ సమావేశం

మండపేట, జూన్ 28: మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ పతివాడ నూకరాణి అధ్యక్షతన జరుగుతుందని కమిషనరు బి.రాము తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన వేగుళ్ల జోగేశ్వరరావు ఎక్స్-అఫిషియో సభ్యునిగా హాజరవుతారన్నారు.